

శివాజీ సేవలు ఆదర్శనీయం

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని యువత సమాజసేవా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. 8లో▸



ఆదర్శంగా అభివృద్ధి

కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 8లో▸



రైతుల ధర్నా

రుణమాఫీ అయిందని మెసేజ్‌లు వచ్చినా ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదని రైతులు శనివారం ధర్నాకు దిగారు. 8లో▸

చేరికల జోష్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. అధికార పార్టీ నుంచి బలమైన నేతలు కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. పీసీసీ చీఫ్ తన చిరకాల ప్రత్యర్థిని పార్టీలో చేర్చుకున్న నాటి నుంచి డీసీసీడీ చైర్మన్ వరకూ అందరూ ప్రభావం చూపే నేతలే కావడంతో జిల్లా వ్యాప్తంగా హస్తం గాలి వీస్తోందనే చర్చ ఊపందుకుంది.

బలోపేతం దిశగా హస్తం అడుగులు

- కారు దిగుతున్న బలమైన నేతలు
- ప్రముఖుల చేరికతో మారుతున్న సమీకరణాలు
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న పీసీసీ చీఫ్



నాలుగు నియోజకవర్గాల నుంచి చేరికలు

వికారాబాద్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆ పార్టీలోకి ఇటీవల వలసలు సైతం పెరిగాయి. అధికార పార్టీలోకి సైతం చేరికలు కొనసాగుతున్నా బలమైన నేతలెవ్వరూ గులాబీ కండువా కప్పుకోలేదు... సరికదా ఆ పార్టీ నుంచి రోజుకొక్కరు హస్తం గూటికి చేరుతున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ తదితర నేతలు పార్టీ బలోపేతానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరింది మొదలు అధికార పార్టీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికార పార్టీలోకి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను మించి ఉండడం లేదు. ఇప్పటికే జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకోగా మరికొందరూ అదే దారిలో ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల నుంచి అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఆ పార్టీ గతంతో పోలిస్తే జిల్లాలో బలపడుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

జిల్లా పరిధిలోని నాలుగు నియోజవర్గాల నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. నాలుగు నెలల క్రితం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ముందుగా బీఆర్‌ఎస్‌ను వీడారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గళమెత్తిన ఏఎంసీ మాజీ చైర్మన్ తదితరులు కాంగ్రెస్ గూటికి చేరారు. మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి, నియోజకవర్గంలో మరో ఇద్దరు ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు వారి అనుచరులతో కలిసి పార్టీ వీడనున్నరనే వార్తలు వస్తున్నాయి. వికారాబాద్ మున్సిపాలిటీలోనూ పలువురు ప్రజా ప్రతినిధులు పార్టీ వీడతారనే ప్రచారం జరుగుతోంది.

- పరిగి నుంచి ఓ ఎంపీపీ, నార్మాక్స్ డైరెక్టర్, సర్పంచ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.
- తాండూరులో ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడగా మరికొందరు అదే బాటలో నడిచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి సైతం అధికార పార్టీని వీడడం చర్చనీయాంశంగా మారింది. బీఎంఆర్‌కు తాండూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు పార్టీ హామీ ఇచ్చిందని సమాచారం.
- చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోకి వచ్చే నవాబుపేట మండలానికి చెందిన పలువురు అధికార నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది.

తెరవెనుక చక్రం తిప్పుతున్న రేవంత్‌రెడ్డి

తాను ప్రాతినిథ్యం వహించనున్న వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తన చిరకాల ప్రత్యర్థి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించడం మొదలు అలజడి మొదలైంది. అధికార పార్టీ దిద్దుబాటు చర్యలకు పూనుకోకపోగా గ్రూపు రాజకీయాలకు తెరలేపారు. కొందరు నాయకులు కాంగ్రెస్ వేసిన ఎత్తుగడలతో పార్టీని వీడి హస్తం గూటికి చేరగా.. మరికొందరు ఎమ్మెల్యేల ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ పార్టీని వీడుతున్నారు. బీఆర్‌ఎస్‌లోని ఈ పరిణామాలను హస్తం ఒడిసిపట్టుకుంటోంది. అలకబూనిన పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెడితే వలసలను నివారించవచ్చని అధికార పార్టీ పాచికలు సైతం పారడం లేదు. పార్టీని వీడుతున్న వారిలో ఎక్కువగా పట్నం అనుచరగనమే ఉంటుండడం చర్చనీయాంశంగా మారింది.



వృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

వృద్ధుల బాధ్యత కుటుంబీకులదే..

- వారి సమస్యల పరిష్కారానికి 24567 హెల్ప్‌లైన్ ఏర్పాటు
- 80 ఏళ్లు దాటితే ఇంటి వద్ద నుంచే ఓటేయొచ్చు
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వృద్ధులకు చేయూతనిస్తూ వారిని ఆనందంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. చిన్ననాటి నుంచే పెద్దలను గౌరవించేలా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. వృద్ధులను ఇబ్బందులకు గురి చేస్తే సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం చర్యలుంటాయన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి 24567 హెల్ప్‌లైన్‌తో పాటుగా వెబ్‌సైట్ ఏర్పాటు చేశారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 42,484 మందికి వృద్ధాప్య పెన్షన్లు అందుతున్నాయని చెప్పారు. వృద్ధులంతా ఓటింగ్‌లో పాల్గొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఈ ఏడాది నుంచి 80 ఏళ్లు దాటిన వారు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తుందన్నారు. అనంతరం 9 మంది వృద్ధులను కలెక్టర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, డీడబ్ల్యూఓ లలిత కుమారి, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, డిప్యూటీ డీఆర్డీఓ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యం

మహేశ్వరం: ధర్మ రక్షణ కోసమే బజరంగ్‌దళ్ పని చేస్తుందని విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదర్శి పండిరినాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం శౌర్య జాగరణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, కులతత్వం, లవ్ జిహాద్ పేరుతో హిందూ సమాజంపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు దేశ వ్యతిరేక, జాతి వ్యతిరేక కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంతకు ముందు శివగంగ రాజరాజేశ్వర ఆలయం నుంచి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు కుమార స్వామి, రిటైర్డ్ ఆర్మీ కల్నల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి



షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

- మంత్రి మహేందర్‌రెడ్డి
- షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన
- ముస్లిం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

కొడంగల్: రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ముస్లిం మహిళలకు బతుకమ్మ చీరలు, మైనార్టీ యువతకు క్రీడా వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్‌లో ముస్లింల అభ్యున్నతికి, అవసరాల నిమిత్తం రూ.కోటి వెచ్చించి షాదీఖానా నిర్మిస్తున్నట్లు వివరించారు. అన్ని పథకాల్లో ముస్లింలకు పెద్దపీట వేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ముస్లింలు మరోసారి నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ సలీం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, మాజీ సర్పంచు రమేశ్‌బాబు, సర్పంచ్ అంజద్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తెలంగాణ పోలీసింగ్

కడ్తాల్: తెలంగాణ పోలీసుల పనితీరు దేశానికే తలమానికమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మండల కేంద్రంలో రూ.1.50 కోట్ల సీఎస్‌ఆర్ ఫండ్ (బటర్ ఫ్లై సిటీ సహకారం)తో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని శనివారం డీజీపీ అంజనీకుమార్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌తో కేసీఆర్ పలుమార్లు ఢిల్లీకి వెళ్లి తెలంగాణ ఇవ్వాలని కోరినా.. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ బాగోలేదని, నక్సలిజం ఉందని చెప్పేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో శాంతిభద్రతలు, అభివృద్ధి, సంక్షేమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఇందుకోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని తెలిపారు. పోలీసు శాఖకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఉమ్మడి పాలనలో హైదరాబాద్, సైబరాబాద్ రెండు కమిషనరేట్లే ఉండేవని, తెలంగాణ ఏర్పాటు తర్వాత వీటి సంఖ్య 9కి చేరుకుందని చెప్పారు. పోలీసు శాఖలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా 64 శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖతో పాటు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. ముఖ్యంగా మహిళల భద్రతపై ఎక్కువ దృష్టిసారించామని తెలిపారు. కడ్తాల్‌లో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం అన్ని రకాల సదుపాయాలతో అద్భుతంగా ఉందన్నారు.

పోలీస్ వ్యవస్థ పనితీరు భేష్

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పనితీరు సమర్థవంతంగా ఉందని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవడంతో పాటు డిపార్ట్‌మెంట్‌లో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు.

పోలీసుల కృషి ప్రశంసనీయం

సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి మహమూద్ అలీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

సీఎండీ, ఈడీకి సన్మానం

రూ.1.50 కోట్లతో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు, ఈడీ రమేశ్‌ను.. హోంమంత్రి, డీజీపీ అంజనీకుమార్, ఎంపీ, ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, డీసీపీ నారాయణరెడ్డి, ఏడీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామి, ఎస్‌హెచ్‌ఓలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా మంత్రుల పర్యటనలు

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలతో బిజీ

- ఒకవైపు అభివృద్ధి మంత్రం.. మరోవైపు బుజ్జగింపుల పర్వం
- కేడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం
- అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



ఇటీవల షాద్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా జిల్లాపై ఫోకస్ పెట్టింది. ఇక్కడ గెలుపొందే సీట్లే కీలకంగా మారతాయని.. ఈ మేరకు మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఒకవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ.. మరోవైపు ఇప్పటికే చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాల పేరుతో విస్తృత ప్రచారం చేస్తోంది. తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాలు.. వాటి ఫలితాలను ప్రజలకు వివరిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది. కొద్ది రోజులుగా మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. హోంమంత్రి మహమూద్ అలీ, పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తరచూ పర్యటిస్తున్నారు. ఇక జిల్లా మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మహేశ్వరం, చేవెళ్ల నియోజకవర్గాల్లో కలి యతిరుగుతున్నారు.

సెమీ అర్బన్ కావడం వల్లే..

ఉమ్మడి జిల్లాలో 18 నియోజకవర్గాలు ఉండగా, వీటిలో మెజార్టీ సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే విస్తరించి ఉన్నాయి. ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, మేడ్చల్ నియోజకవర్గాల్లోని చాలా ప్రాంతాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ఓటర్లతో పోలిస్తే ఇక్కడి ఓటర్లకు రాజకీయ చైతన్యం ఎక్కువ. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఇక్కడ మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అధిష్టానం అంతా గ్రేటర్‌లో పర్యటించినా.. ఆశించిన స్థాయిలో డివిజన్లు గెలవలేకపోయింది. మరోవైపు ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు ముగ్గురు బలమైన నేతలు ఉన్నారు. మళ్లీ సిట్టింగ్‌లకే టికెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో ఆశావహులు పక్క చూపు చూస్తున్నారు. ఇప్పటికే కొంత మంది నేతలు పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో నేతల మధ్య సమన్వయ లోపాన్ని.. అంతర్గత కుమ్ములాటలను చక్కదిద్ది.. పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధిష్టానం నిర్ణయించింది. కేడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

ముమ్మరంగా పర్యటనలు

రెండు మూడు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందన్న ప్రచారంతో మంత్రులు తమ పర్యటనలను ముమ్మరం చేశారు. మంత్రి కేటీఆర్, పార్టీలో ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందిన మంత్రి హరీశ్‌రావు రెండు మూడు రోజులకోసారి జిల్లాలో పర్యటిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ .. ప్రభుత్వ పథకాలను గుర్తు చేస్తూ.. ప్రతిపక్షాలను ఎండగడుతూ వస్తున్నారు.ఇంకోవైపు ఇప్పటి వరకు పార్టీలో గుర్తింపు, ప్రభుత్వ శాఖల్లో పదవులు దక్కక తీవ్ర అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగిస్తూ.. వారు పార్టీ వీడకుండా చూస్తున్నారు. తాజాగా శనివారం హోంమంత్రి మహమూద్ అలీ కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలంలో పర్యటించారు. కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో నిర్మించే 24 కుల సంఘాల ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని హైతాబాద్, మాచన్‌పల్లి, మల్లారెడ్డి గూడా గ్రామాల్లో పర్యటించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్లపై దాడులు

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- 20 పెద్ద, 74 చిన్న సిలిండర్లు స్వాధీనం
- ఐదుగురిపై కేసు

తాండూరు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న పలు కేంద్రాలపై శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. పరిగి, కొడంగల్, తాండూరు పట్టణాల్లో చేసిన దాడుల్లో సిలిండర్లను సీజ్ చేసి ఐదుగురు దుకాణ యజమానులపై కేసు నమోదు చేశారు. ఎస్పీ కోటిరెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పరిగి పట్టణంలో దాడులు చేయగా ఎండి అహ్మద్ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన ఎనిమిది పెద్ద సిలిండర్లు, 12 చిన్న సిలిండర్లను, ఖాన్ కాలనీలోని ఎండి అక్తార్ దుకాణం నుంచి మూడు పెద్ద సిలిండర్లు, 26 చిన్న సిలిండర్లను, తాండూరు పట్టణంలోని వినాయక్ చౌక్‌లో ఉన్న ఫజల్ దుకాణం నుంచి రెండు పెద్ద సిలిండర్లు, 12 చిన్న సిలిండర్లు, చించోళి రోడ్డు మార్గంలోని ముస్తఫా దుకాణంలో మూడు పెద్ద సిలిండర్లు, 11 చిన్న సిలిండర్లు, అలాగే కొడంగల్ పట్టణంలోని ఆర్యనగర్ కాలనీకి చెందిన కంచి శివానంద్ దుకాణం నుంచి నాలుగు పెద్ద సిలిండర్లు, 13 చిన్న సిలిండర్లను సీజ్ చేశారు. ఈ మేరకు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

న్యూస్‌రీల్

ధారూరు ఎంపీడీఓగా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణ్ అమిత్ మాలెంపాటి

ధారూరు: శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటి ధారూరు ఎంపీడీఓగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ నారాయణరెడ్డి శిక్షణలో భాగంగా ఆయన్ను ధారూరు ఎంపీడీఓగా నియమించారు. ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్ పదోన్నతిపై వెళ్లగా ఎంపీఓ షఫీఉల్లా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

జాతీయ ఖోఖో పోటీల రెఫరీగా గోపాల్



దోమ: జాతీయ ఖోఖో పోటీల రెఫరీగా దిర్సంపల్లి జెడ్పీహెచ్ పీఈటీ జి.గోపాల్ ఎంపికైనట్లు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాది కృష్ణమూర్తి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జయప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 6 నుంచి తమిళనాడు రాష్ట్రంలోని హుసూర్‌లో ఖేలో ఇండియా లీగ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలకు గోపాల్ రెఫరీగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

సమాచారం లేకుండా లబ్ధిదారుల ఎంపిక

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సర్పంచ్ వర్గీయులు

పూడూరు: ప్రభుత్వం అందజేస్తున్న దళిత బంధు, గృహలక్ష్మి పథకాలు కేవలం బీఆర్‌ఎస్ నాయకులకే ఇస్తున్నారని తిర్మలాపూర్ సర్పంచ్ కమ్లీబాయి ఆరోపించారు. శనివారం సర్పంచ్ వర్గీయులు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వ్యతిరేకంగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రోడ్డుపై బైఠాయించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామస్తులకు అందరికీ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోలీసులు సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ఓటరు దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో ఫారం 6,7,8ల ద్వారా వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన పనులను బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వికారాబాద్ నియోజకవర్గ తహసీల్దార్లు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో జిల్లా అదనపు కోర్టు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటు కాబోతుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఇబ్రహీంపట్నంలో నాలుగు కోర్టులు పని చేస్తున్నాయి. 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, 15 అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సైబరాబాద్‌ను ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టు పరిధిలోకి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం మండలాలు రానున్నాయి.

క్లుప్తంగా

అప్పులబాధతో రైతు ఆత్మహత్య


వెంకటయ్య (ఫైల్)

పరిగి: అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కాడ్లపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య(50). తన మూడు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పంట సాగుకు ప్రైవేటు వ్యక్తుల వద్ద, బ్యాంకులో రూ.5 లక్షల అప్పులు చేశాడు. పంటలు సక్రమంగా పండకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య పద్మమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోండి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణుడు, ఉస్మానియా యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాధాకిషన్‌రావు సూచించారు. పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మనోవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయన్నారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి సమాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ప్రిన్సిపాల్ వెంకటయ్యగౌడ్, మచ్చేందర్, నాగరాజు పాల్గొన్నారు.

తాండూరులో బీఆర్‌ఎస్ కుట్ర


తీర్మానం కాపీని చూపిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- గెలిచే పరిస్థితి లేకే మనోహర్‌రెడ్డిని పంపారు
- ఆయన గెలిస్తే తిరిగి కారెక్కుతాడు
- మంత్రి మహేందర్‌రెడ్డి కుట్రకు సూత్రధారు
- కేఎల్లార్ లేదా రమేశ్ మహరాజ్‌కు టికెట్ ఇవ్వాలి
- కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ తీర్మానం

తాండూరు రూరల్: కొంత మంది కాంగ్రెస్ పెద్దలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తాండూరు కాంగ్రెస్ టికెట్టు మనోహర్‌రెడ్డికి ఇప్పించేందుకు బీఆర్‌ఎస్ అధిష్టానం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పి.జనార్దన్ రెడ్డిలు ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తాండూరులో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ బలంగా ఉండటంతో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికి తాండూరు కాంగ్రెస్ పార్టీ టికెట్టు ఇప్పించేందుకు మంత్రి మహేందర్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గెలిచిన తర్వాత మనోహర్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌లోకి తీసుకోస్తానని మంత్రి కేటీఆర్‌కు మహేందర్‌రెడ్డి మాటిచ్చారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ అధిష్టానం కుట్రను కార్యకర్తలు భగ్నం చేయాలన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులను మోసం చేశారని.. ప్రస్తుతం కూడా మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. కావునా, రమేష్ మహరాజ్ లేదా కెఎల్‌ఆర్‌కు టికెట్టు ఇవ్వాలని తీర్మానం చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్‌కు మంచి ఆదరణ ఉందన్నారు.

రామ్మోహన్‌రెడ్డికి ఎంపీగా అవకాశం ఇవ్వాలి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.రాంమోహన్‌రెడ్డికి చేవెళ్ల ఎంపీగా అధిష్టానం అవకాశం ఇవ్వాలని.. మనోహర్‌రెడ్డికి పరిగి టికెట్టు ఇస్తే సంతోషిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, నాయకులు రాజ్‌కుమార్ ,జర్నప్ప, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, జైపాల్, శంశులు ఉన్నారు.

బ్యాంకు ఎదుట రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

నవాబుపేట: ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చినా ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదని పులుమామిడి గ్రామ రైతులు శనివారం బ్యాంకు ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన 100 మంది రైతులకు రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్లకు రుణమాఫీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయన్నారు. బ్యాంకు మేనేజర్‌ను పలుసార్లు సంప్రదించినా ఇంకా రాలేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను సంప్రదిస్తే మా వద్ద ఎలాంటి తప్పు లేదని బ్యాంకు అధికారులను అడగాలని చెబుతున్నారని వాపోయారు. స్పందించిన మేనేజర్ మహేందర్ మాట్లాడుతూ.. ఇంకా చాలా మందికి రుణమాఫీ డబ్బులు రాలేదని, రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. కొంత మంది రైతులు రుణాలను క్లోజ్ చేసినా మాఫీ కావడం లేదన్నారు. వచ్చిన రైతులందరికీ వారి వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. రాని రైతుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దీంతో రైతులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా రోహిత్‌కుమార్


రోహిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాలేపల్లి పంచాయతీ పాలకవర్గం

దోమ: ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో మండల పరిధిలోని పాలేపల్లి గ్రామానికి చెందిన ఎం.రోహిత్ కుమార్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. దీంతో శనివారం సర్పంచ్ యశోద తిరుపతి సాగర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువగా పోటీ ఉండే ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. యువత మరింత పట్టుదలతో ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోషి, నాయకులు అంజిలయ్య, బసప్ప, గంగపురి, జె.చందు, మల్లేశ్, తుపాలి రాజు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదు

కాంగ్రెస్ నేత సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: మాజీమంత్రి ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి , మాజీ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, కౌన్సిలర్ మురళి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9 ఏళ్లలో చేయని అభివృద్ధి ప్రస్తుతం ఎలా చేశారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ఎన్నికలప్పుడే అభివృద్ధి గుర్తుకు వస్తుందాని నిలదీశారు. వికారాబాద్‌కు కొత్తగా నిధులిచ్చింది ఏమి లేదన్నారు. వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేనిది శంకుస్థాపన ఎలా చేస్తారని విమర్శించారు. శాటిలైట్ పనుల టెండర్ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరుగుతాయని ఈ విషయం కూడా తెలియదా ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పద్ధతి ప్రకారం రాజకీయాలు చేయాలని, నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు. 125 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి గ్యారంటీ, వారెంటి ఉన్నాయన్నారు. గ్యారంటి లేనిది మీకని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రెడ్యానాయక్, వహిద్ మియా, ఆసిఫ్, శ్రీనివాస్, ఖాలేద్, వేమారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

పీఆర్ ఏఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

జెడ్పీటీసీ సంతోష



బంట్వారం: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించని పీఆర్ ఏఈ శ్రావణ్‌కుమార్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని జెడ్పీటీసీ కే.సంతోష తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 6వ తేదిన బస్వాపూర్ ,తొర్మామిడిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఏఈ తనను ఆహ్వానించి అవమానించారన్నారు. ఏఈ ఆహ్వానం మేరకు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలిగా తాను మండలానికి వెళ్లినప్పటికీ తనకు తెలియకుండానే ప్రారంభించారన్నారు. తనకు జరిగిన అవమానంపై కలెక్టర్‌కు పిర్యాదు చేస్తానని ఆమె వివరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

మొయినాబాద్: ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని అజీజ్‌నగర్ పాత గేట్ సమీపంలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సీఐ ఏపీ రంగా వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం తంగడపల్లికి చెందిన భాస్కర్‌గౌడ్, కవిత(38) నగరంలోని ఆసిఫ్‌నగర్‌లో అద్దెకు ఉంటూ.. మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. వారం రోజుల క్రితం కవిత తల్లి చనిపోవడంతో పెత్తరమావాస్యకు ముందు.. పెద్దలకు బియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కొడుకు రాకేశ్‌తో కలిసి ముగ్గురూ బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. అజీజ్‌నగర్ పాత గేటు సమీపంలోకి రాగానే.. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారని గమనించిన రాకేశ్ పక్కకు ఆపుకొనేందుకు బైక్‌ను స్లో చేశాడు. ఈ సమయంలో వెనక నుంచి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న కవిత ఎగిరి రోడ్డుపై పడిపోయింది. బస్సు ముందు చక్రాలు ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. భాస్కర్‌గౌడ్, రాకేశ్‌కు గాయాలయ్యాయి. తమ కళ్లెదుటే కవిత చనిపోవడంతో కొడు కు, భర్త గుండెలు బాదుకున్నారు. మృతురాలు కవిత పుట్టిల్లు, మెట్టిల్లు తంగడపల్లే కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థానికుల నిరసన

విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. ఇరుకుగా ఉన్న పాతగేట్ సమీపంలో తనిఖీలు నిర్వహించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. పోలీసులు వీరికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇదే మార్గంలో వెళ్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి కాన్వాయ్‌ను ఆపి ప్రమాద తీరును పరిశీలించారు. పోలీసుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు.

పరిగి బరిలో శైలేందర్‌రెడ్డి?


శైలేందర్‌రెడ్డి

పరిగి: మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుటుంబం నుంచి ఆయన మనవడు శైలేందర్‌రెడ్డి (కూతురి కొడుకు) పరిగి నియోజకవర్గం బరిలో ఉంటారని సమాచారం. ఇక్కడి నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా సేవలందించిన కమతం అడుగుజాడల్లో ముందుకెళ్తున్నారు. నియోజకవర్గంలో తన తాత చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. నిత్యం జనం మధ్యలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శైలేందర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. పండుగలు, ఉత్సవాల నేపథ్యంలో నియోజకవర్గం మొత్తం ప్లెక్సీలతో నింపి తన పరిచయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా పరిగి ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారు. నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇటీవల పలు గ్రామాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. రెండు ప్రధాన పార్టీల నుంచి ఆయన టికెట్ ఆశిస్తున్నారని సమాచారం. ఏ పార్టీ నుంచైనా అవకాశం వస్తే బరిలో ఉంటానని, టికెట్ రాకపోయినా ప్రజాసేవ చేస్తానని 'సాక్షి'కి తెలిపారు.

చెత్త ఆటోలో బతుకమ్మ చీరలు

నిర్లక్ష్యంగా మున్సిపల్ అధికారులు


చెత్త తరలించే ఆటోలో బతుకమ్మ చీరలను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు టౌన్: పేదలంటే ధనికులతో పాటు మున్సిపల్ అధికారులకూ అలుసై పోయారు. ఎలాగూ ఉచితంగా పంపిణీ చేసే చీరలే కదా అనుకున్నారేమో చెత్త తరలించే వాహనాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు పట్టణంలోని రేషన్ దుకాణాలకు తరలించారు. తాండూరు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని, పేద మహిళలపై వారికి ఉన్న అభిప్రాయాన్ని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. అసలు వాహనాలే దొరకనట్లు చెత్త తరలించే ఆటోలు, ట్రాక్టర్లలో బతుకమ్మ చీరలను తరలించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఛత్రపతి శివాజీ సేవలు ఆదర్శనీయం


శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మర్పల్లి: ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని యువత సమాజసేవా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్‌లో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ విగ్రహాన్ని స్థానిక సర్పంచ్ ఉమరాణి, జెడ్పీటీసీ మధుకర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజ స్థాపన కోసం ఛత్రపతి శివాజీ మహరాజ్ అప్పట్లో పోరాటం చేసి పలు సంస్థానాలను కైవసం చేసుకుని చక్కని పాలన అందించారని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మర్పల్లి జెడ్పీటీసీ పబ్బే మధుకర్, ఛత్రపతి శివాజీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు బైలూర్ యోగేశ్ ప్రభూజీ, శివాజీ విగ్రహా ఉత్సహ కమిటీ సభ్యులు రాంరెడ్డి, జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ఉమరాణి, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శివకుమార్, శేఖర్, జైపాల్‌రెడ్డి, అశోక్, వార్డు మెంబర్లు జ్యోతి, సాయిరెడ్డి, దేవయ్య గ్రామస్తులు ఉన్నారు.

యువతి బలవన్మరణం

- వేధింపులు తాళలేక ఆత్మహత్య
- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి చెందిన నీరుడి వెంకటేశ్‌కు ఇద్దరు కుమార్తెలు. చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే చిన్న కుమార్తె శ్రీవాణి డిగ్రీ వరకు చదివి ఇంట్లోనే ఉంటుంది. వ్యాపారంలో ఫోన్ పే ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆమె తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఇంటికి ఎదురుగా ఉన్న సాయి అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. శ్రీవాణిని సాయి నమ్మించి ఫోన్ పే ద్వారా ఆమె వద్ద నుంచి రూ.10 లక్షల వరకు తీసుకున్నాడు. పెళ్లి కోసం బ్యాంక్‌లో జమ చేసిన డబ్బులు కావాలని తల్లిదండ్రులు, ఆమెను అడిగారు. దీంతో సాయిపై డబ్బులు కావాలని ఒత్తిడి పెంచింది. అతను డబ్బులు ఇవ్వకుండా బాధితురాలిని మానసికంగా వేధించాడు. వేధింపులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులకు ఆమె వద్ద సూసైడ్ నోట్ లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.


ఆదర్శంగా కొడంగల్ అభివృద్ధి


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పట్నం నరేందరెరెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ హయాంలో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ సహకారం కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపామన్నారు. శనివారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అర్హులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. బొంరాస్‌పేట మండలంలోని ఏర్పుమళ్లలో రూ.94లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల భవనం, ముదిరాజ్ భవనం, బుడుగజంగం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అలాగే గ్రామపంచాయతీ భవనం, పల్లె దవఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే దుద్యాల మండలంలోని హకీంపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఉమ్మడి బొంరాస్‌పేట ఎంపీపీ హేమీబాయి, మండలాల నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి, యాదగిరి, చాంద్‌పాషా, సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ సునీతకు డాక్టరేట్



మొయినాబాద్‌రూరల్: తెలుగు అకాడమీలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలోని వికారాబాద్ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న నీటూరి సునీత పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. 2019 నుంచి తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న సునీత తన బోధన పటిమతో విద్యార్థులు, అధికారుల మన్ననలు పొందారు. ఎంతో మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పీజీలో ప్రవేశాలు పొందేందుకు కోచింగ్ సైతం ఇచ్చారు. ఆచార్య మాదిరెడ్డి అండమ్మ పర్యవేక్షణలో 'అస్రిత కులాల కళావాయిద్యాల సంస్కృతి, సాహిత్య అంశాలు విశిష్టత' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో సిద్ధార్థ గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పట్టా పొందారు. పీహెచ్‌డీ పట్టా పొందడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ, అధ్యాపకులు, కుటుంబసభ్యులు అభినందించారు.

నైపుణ్యం సాధించాలి

మొయినాబాద్: వృత్తి విద్యలో విద్యార్థులు సరైన నైపుణ్యం సాధిస్తే బాగా రాణిస్తారని మొయినాబాద్ ఎస్‌ఐ రామచంద్ర అన్నారు. మొయినాబాద్ మండలంలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఎంబీఏ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంబీఏ కోర్సులో మంచి నైపుణ్యం సాధిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎంబీఏతో మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ నసర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కానిస్టేబుల్ శ్రావణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.